ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా 35, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 26, పందిరి బీర 26, క్యాబేజీ 11, క్యారెట్ 41, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు బీఈడీ అభ్యర్థుల జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: బీఈడీ కోర్సులో సీటు సాధించిన అభ్యర్థుల మొదటి విడత జాబితాను ఆదివారం విడుదల చేయనున్నట్లు టీజీ ఎడ్‌సెట్–2025 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి శనివారం తెలిపారు. ఎడ్‌సెట్–2025లో అర్హత సాధించిన అభ్యర్థుల్లో 17, 151 మంది వివిధ బీఈడీ కాలేజీలో ప్రవేశాలకు వెబ్‌ఆప్షన్స్ ఇచ్చినట్లు చెప్పారు. సీటు సాధించిన విద్యార్థులు ఈ నెల 11 నుంచి 14 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన ఎల్లమ్మ అమ్మవారు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం పండుగ నేపథ్యంలో ఉదయం మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. గర్భగుడిలో అమ్మవారిని రాఖీలు, వివిధ పకాల పూలు, జామపండ్లతో ఆకారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.

కొమురంభీమ్‌కు ఘన నివాళి



కొమురంభీమ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గిరిజన ఐక్య వేదిక నాయకులు

అడ్డగుట్ట: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌లోని కొమురంభీమ్ విగ్రహానికి గిరిజన ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు వివేక నాయక్‌తో కలిసి అడ్డగుట్టకు చెందిన పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామలీల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బీకేగూడలో వ్యక్తి అదృశ్యం



ఉమా మహేశ్

అమీర్‌పేట: బీకేగూడలో నివసించే ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీకేగూడలోని బాలాజీ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముండే కొల్లూరు ఉమామహేశ్ (42) మానసిక సమస్యతో గత నెల 25న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని ఆచూకి కోసం అనేక ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో అతని సోదరి వాసంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎవరికైన ఆచూకి తెలిస్తే ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో లేదా 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: హాస్టల్ ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలివీ... వరంగల్‌కు చెందిన బి.అఖిల్ అమీర్‌పేట బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు సమీపంలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. తాత్కాలికంగా తమ బంధువుల ద్విచక్ర వాహనాన్ని వినియోగిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీ రాత్రి వాహనాన్ని తాను ఉంటున్న హాస్టల్ ఎదుట పార్కింగ్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోనాలకు సర్వం సిద్ధం

బోనాల వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఏసీపీ యాదగిరి



హాజరైన ఆలయ కమిటీల ప్రతినిధులు




సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ యాదగిరి

బన్సీలాల్‌పేట్: బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు నిర్వహించుకోవాలని ఏసీపీ యాదగిరి అన్నారు. గాంధీనగర్ పోలీసు స్టేషన్ ఆవరణలో శనివారం రాత్రి ఆలయ కమిటీల ప్రతినిధులు, నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. సకాలంలో బోనాలతో పాటు అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపులను త్వరగా ముగించాలని నిర్వాహకులకు సూచించారు. తాగి దేవాలయాల వద్ద న్యూసెన్స్ చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించే వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ యాదగిరి చెప్పారు.

◆ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ మాట్లాడుతూ బోనాల సందర్భంగా ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అమ్మవారి బోనాల వేడుకలు ఘనంగా జరగడానికి ప్రజలు నిర్వాహకులు సహకరించాలని క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు మౌనికా, నర్సింహాలతోపాటు బోయిగూడ, బన్సీలాల్‌పేట్, చాచానెహ్రూనగర్, కవాడిగూడ, బోలక్‌పూర్, బండమైసమ్మనగర్, బీజేఆర్ నగర్ ప్రాంతాలకు చెందిన ఆలయ కమిటీ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్ఖనా మహంకాళి ఆలయం ముస్తాబు



శ్రావణమాస బోనాల జాతరలో భాగంగా కంటోన్మెంట్‌లో ప్రసిద్ధి చెందిన రెండు వందల ఏళ్లనాటి కార్ఖనా మహంకాళి అమ్మవారి జాతర శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో వివిధ పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మహాదేవ్ సింగ్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడా నిర్వహించని విధంగా ఒకే చెట్టు ద్వారా రూపొందించిన ఏడుగురు అమ్మవార్ల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తారన్నారు. అదే విధంగా అమ్మవారి ఘటాన్ని పుర వీధుల గుండా బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తారని తెలిపారు. నేడు బోనాల, ఫలహార బండ్ల, తొట్టేల సమర్పణ, సోమవారం మాతంగి స్వర్ణలత ఆధ్వర్యంలో రంగం కార్యక్రమంలో భాగంగా భవిష్యవాణి నిర్వహిస్తారన్నారు. – రసూల్‌పురా

నేడు బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు అమ్మవారి బోనాల వేడుకలు జరగనున్నాయి. ఆలయాలను విద్యుత్ దీపాలు, రంగు రంగుల పువ్వులతో ముస్తాబు చేశారు. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, చాచానెహ్రూనగర్, బండమైసమ్మనగర్, బీజేఆర్ నగర్, బోలక్‌పూర్, ఐడిహెచ్ కాలనీ, బోలక్‌పూర్, సున్నంబట్టీ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో సర్వం సిద్ధం చేశారు. అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. బోనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ చెప్పారు.

కనుల పండువగా వేంకన్నస్వామి కల్యాణోత్సవం



పద్మావతి, గోదా సమేత ప్రసన్న వేంకన్నస్వామి

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పద్మావతి, గోదా సమేత ప్రసన్న వేంకన్న స్వామి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ రాజేశ్‌కుమార్, అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావులు తెలిపారు. ఆలయ ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మారామసూర్యసుబ్రహ్మణ్యం, శివశంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, షణ్ముఖరావులతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఓయూలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆదివాసి స్టూడెంట్ యూనియన్ (ఏఎస్‌యూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివాసి జాతీయ పతాకాన్ని ఓయూ అధ్యాపకులు ప్రొ.రేగ రాజేందర్ ఎగురవేసి మాట్లాడారు. అనంతరం ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌యూ రాష్ట్ర నాయకులు సాగబోయిన పాపారావు, అరుణ్‌కుమార్, వెంకన్న, బొచ్చు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఓయూలో ఆదివాసీ నృత్యాలు

ఘనంగా జంధ్యాల పౌర్ణమి వేడుకలు

అంబర్‌పేట: గోల్నాక వీరన్నగుట్ట శివాలయం ప్రాంగణంలో శనివారం అంబర్‌పేట నియోజకవర్గ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జంధ్యాల పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పద్మశాలి కులస్తులు జంధ్యాలు మార్చుకుని మార్కెండేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, అధ్యక్షుడు వరకాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలుక శికకుమార్, ప్రతినిధులు కె.సత్యానారాయణ, సత్తయ్య, తీగల నరేందర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు శాస్త్రీయ సంగీతం, కూచిపూడి నేర్పించాలి



చిక్కడపల్లి: కళల ద్వారా ఉన్నతమైన సమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో శ్రీ రాఘవ కూచిపూడి నృత్య, సంగీత కళా నిలయాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సాయిశరణ్య, సాయిశ్రావ్య అన్నారు. త్యాగరాయ గానసభలో శనివారం కళా నిలయం ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా నటరాజస్వామికి పూజ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళలకు కాణాచి అయిన ప్రకాశం జిల్లా ఒంగోలు వేదికగా తమ కళా సంస్థను ఏర్పాటు శాస్త్రీయ సంగీతం, కూచిపూడి నృత్యాన్ని పరిచయం చేస్తున్నామని అన్నారు. ఈ కళలను చిన్నతనం నుంచి నేర్పిస్తే వారు క్రమశిక్షణ గల పౌరులుగా ఎదుగుతారని అన్నారు. వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు సంగీతం, నృత్యం తోడ్పడుతాయని తెలిపారు.

◆ ప్రకాశం జిల్లాకు చెందిన సినీ మాటల రచయితగా మరుధూరిరాజా, సంగీత దర్శకులుగా సాయికార్తీక్ ప్రవేశించి ఉన్నతస్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. తమ కళా నిలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వారిని సత్కరించుకోవడం అభినందనీయమని అన్నారు. అదే విధంగా నాటక రంగ గురువులు చిట్టా శివప్రసాద్, కూచిపూడి నృత్య గురువులు ఎస్వీ శివకుమారిలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 50మంది కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత విభావరి ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దైవజ్ఞశర్మ, కళాకారులు జస్వత్, సుమంత్, కరవది నాగలక్ష్మి పాల్గొన్నారు.

నైపుణ్యం ఉన్న యువతకు ఉజ్వల భవిష్యత్



జాబ్ మేళాలో పాల్గొన్న కార్డినల్ పూల ఆంథోనీ

కార్డినల్ పూల ఆంథోనీ

రాంగోపాల్‌పేట్: యువత చదువుతో పాటు వివిధ రకాల నైపుణ్యాలను అందిపుచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కార్డినల్ పూల ఆంథోనీ అన్నారు. శనివారం హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ హైదరాబాద్, దిశ డాన్‌బోస్కో సంయుక్త ఆధ్వర్యంలో రెజిమెంటల్‌బజార్‌లోని సెయింట్ మేరీస్ హైస్కూల్ ఆవరణలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజం యువతీ, యువకుల ద్వారా నడిపించబడుతుందని, వారే దేశానికి బలమన్నారు. అందుకే అధికశాతం ఉన్న యువత విద్యతో పాటు నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. పెద్ద ఎత్తున జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ జాబ్ మేళాలో 53 కంపెనీలు పాల్గొనగా 720 మంది యువతీ, యువకులు హాజరు కాగా 410 మంది వివిధ పోస్టులకు ఎంపికయ్యారు. 160 మందికి అప్పటికప్పుడు నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, పాదర్ ఇన్నయ్య, ఫాదర్ జస్టిన్‌లు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

పద్మారావునగర్: ఆలయాలు ఆధ్యాత్మిక చింతన నిలయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ గాంధీనగర్‌లోని షిర్డి సాయిబాబా ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక మార్గం ద్వారా ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శాంతికుమార్, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవం

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని శ్రీ బండ నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సుమారు మూడు శతాబ్దాల చరిత్ర కల్గిన నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. రాత్రి 7 గంటలకు స్వామివారిని గరుడ వాహనంలో ఖైరతాబాద్ పురవీధుల్లో ఊరేగించారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డితో పాటు ఆల య తాంత్రి నీపురం శ్రీహరం స్వామి, వెంకటేష్ స్వా ములతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆత్మీయతకు రక్ష

అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచికంగా రక్షా బంధన్ పండుగను నిర్వహించుకుంటారు. పుట్టిల్లు ఎంత దూరంగా ఉన్నా అన్నదమ్ముళ్లకు రాఖీ కట్టేందుకు ప్రతీ ఆడపడుచు వచ్చి తమ అనుబంధాన్ని తెలియపరుస్తారు. ప్రతీ ఆడబిడ్డ తన అన్నదమ్ముళ్లు ఆయురారోగ్యాలతో.. అష్టైశ్వర్యాలతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కాంక్షిస్తూ రాఖీ కడుతుంది. రక్షా బంధన్ పండుగను రాఖీ పౌర్ణమి లేదా జంధ్య పౌర్ణమి అంటారు. అందుకే ఈరోజు పాత జంధ్యాన్ని వదిలి కొత్త జంధ్యాన్ని ధరిస్తారు. సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజవర్గాల్లో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. – సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ బృందం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు రాఖీ కడుతున్న బండ కార్తీకరెడ్డి



సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలో మల్లికార్జునస్వామి..



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రాఖీలు కడుతున్న హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట మణిమాల



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు రాఖీలు కడుతున్న ఆయన సోదరిమణులు, చిత్రంలో ఆయన కుటుంబసభ్యులు



సోదరుడికి రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు



బీఆర్‌ఎస్ నాయకుడికి రాఖీ కట్టిన మాజీ కార్పొరేటర్ శేషుకుమారి



మాజీ కార్పొరేటర్లు సదాశివయాదవ్, మనోహర్‌లకు రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు



పద్మారావుకు రాఖీ కట్టిన ఆయన సోదరి శకుంతల



బీజేపీ జిల్లా కార్యదర్శి వీరన్నకు రాఖీ కడుతున్న సోదరి



ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డికి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం



పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్

చిక్కడపల్లి: అభివృద్ధికి అడ్డంకిగా మారిన వాటర్‌వర్క్స్ నూతన పైప్‌లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. అరుంధతినగర్‌లో నూతన వాటర్‌వర్క్స్ పైప్‌లైన్ పనులను శనివారం ఆమె వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, లైన్ సూపర్‌వైజర్ శంకర్‌తో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఇటీవల నూతన పైప్‌లైన్ పనులకు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు అడ్డుపడటంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు అడ్డంకులు తొలగాయని అన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయ పరిచి పనులు జరిపిస్తున్నామని పేర్కొన్నారు. పనులను త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఉమేష్, బస్తీ వాసుల ధనరాజ్, దేవేందర్, రామచందర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.